క్లుప్తంగా

నేడు గణేష్ మట్టి ప్రతిమల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొత్తగూడెం పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మున్సిపల్ ఆఫీస్, పోస్టాఫీస్ సెంటర్, రైల్వే స్టేషన్, రైతు బజారు, ముజీబ్ పాన్‌షాప్, సింగరేణి మెయిన్ ఆస్పత్రి, రామవరం పాత పోస్టాఫీసు, రామవరం చిన్న ఆస్పత్రి వద్ద పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

బస్సు షెల్టర్ ప్రారంభం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్‌ఓసీ, కిష్టారం ఓసీలో విధులు నిర్వహించేందుకు వెళ్తున్న కార్మికుల సౌకర్యార్థం రుద్రంపూర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన బస్సు షెల్టర్‌ను ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజు గురువారం ప్రారంభించారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

పాల్వంచ: పాల్వంచలోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లకు బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.ఝాన్సీరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీకాం, బీజెడ్‌సీ గ్రూపుల్లో సీట్లు ఉన్నాయని, విద్యార్థినులు తమ ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమో, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, పాస్‌ఫొటోలతో శుక్రవారం హాజరు కావాలని కోరారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపు

జూలూరుపాడు: అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ వర్తిస్తుందని కొత్తగూడెం ఏడీఏ నరసింహారావు అన్నారు. గురువారం కరివారిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతు కుటుంబ నిర్ధారణ సర్వే మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ సర్వేను పరిశీలించేందుకు కొత్తగూడెం ఏడీఏ నరసింహారావు వచ్చారు. కరివారిగూడెం రెవెన్యూ పరిధిలోని పలువురు రైతులు దరఖాస్తులు అందజేశారు. జూలూరుపాడు ఏఓ దీపక్ ఆనంద్, ఏఈఓలు ఎంఏ గౌస్, గోపీకృష్ణ, విజయ భాను, లావణ్య పాల్గొన్నారు.

పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఇల్లెందురూరల్: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఇప్పటికే వార్డులు, పంచాయతీల వారీగా ఓటరు జాబితా సరిచేసే పనులను తుది దశకు చేర్చిన అధికారులు తాజాగా పోలింగ్ కేంద్రాల పరిస్థితిపై దృష్టి సారించారు. మండలంలోని పలు గ్రామపంచాయతీల పరిధిలో పోలింగ్ కేంద్రాలను గురువారం ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో వెలుతురు, గాలి, గదుల వైశాల్యం, తాగునీరు, టాయిలెట్స్, వసతి వంటి అంశాలను పరిశీలించారు. ఆయా చోట్ల లోపాలను గుర్తించి వెంటనే సరిచేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

రైతుకు జరిమానా

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామపంచాయతీ పరిధిలో ఏడేళ్ల క్రితం ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి. వాటి వల్ల కోతులు చేనులోకి వస్తున్నాయని బడితండాకు చెందిన వాంకుడోత్ కిషన్ తన చేనుకు సమీపంలో ఉన్న ఏడు మొక్కలను బుధవారం నరికివేశాడు. విషయం తెలుసుకున్న కార్యదర్శి కిరణ్ గురువారం ఘటన స్థలంలో మొక్కలను పరిశీలించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఒక్కో మొక్కకు రూ.300 చొప్పున మొత్తంగా రూ.2,100 జరిమానా విధించారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి..

కొత్తగూడెంఅర్బన్: అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని పాటించకుండా నర్సరీ నుంచి పదో తరగతి వరకు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల ఫీజుల వసూలు చేస్తున్నారని, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని విచారణ జరిపించి, వారికి సహకరిస్తున్న విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈరోజు లేఖ రాసినట్టు తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

ఇల్లెందు: పట్టణంలోని మూడు వార్డులలో పోటెత్తిన వరద ప్రాంతాల్లో గురువారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సందర్శించి పరిశీలించారు. బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, మడుగు సాంబమూర్తి, మండల రాము, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీను ఉన్నారు.

అడుగుకో గుంత.. ప్రయాణమెలా?

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


కారుకొండ వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రాన్ని ఆనుకొని ఉన్న కారుకొండ రోడ్డులో ఎక్కడ చూసినా గుంతలు కనిపిస్తున్నాయి. ఇటీవల వచ్చిన వర్షాలతో అడుగుతో గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ పంచాయతీలోని శేషగిరినగర్ నుంచి కారుకొండ మీదుగా ఇల్లెందు క్రాస్ రోడ్డు వరకు తారు రోడ్డు ఉంది. ఈ రోడ్డు గుండా రేయింబగవళ్లు బొగ్గు, ఇసుక, జామాయిల్ లారీలు, ఆటోలు, వ్యాన్‌లు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేకాకుండా ఈ మార్గంలో పోలీసు హెడ్ క్వార్టర్స్ ఉంది. కొత్తగూడెం పట్టణంలోకి వచ్చే భారీ వాహనాలు, లారీలు, వ్యాన్‌లు, పోస్టాఫీస్ సెంటర్ నుంచి శేషగిరినగర్ మీదుగా, కారుకొండ నుంచి ఇల్లెందు, భద్రాచలం వెళ్తుంటాయి. ఫలితంగా ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడి కంకర తేలింది. చిన్నపాటి వర్షం వచ్చినా గుంతల్లో నీరు నిల్వ ఉంటుంది. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుకు అప్పుడప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ఎప్పుడూ మరమ్మతులు చేయడం లేదు. వాహనాలు ఈ రోడ్డు గుండా వెళ్తుంటే రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇళ్లలోకి వండు నీరు చేరుతోంది. దీంతో ఆయా కుటుంబాలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వాహనాలు వెళ్లే ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేసి, తారు రోడ్డు నిర్మాణం చేయాలని స్థానికులు పలుమార్లు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కూనంనేని ఆధ్వర్యంలో త్వరలో రోడ్డుకు నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ రోడ్డు గతంలో సింగరేణి ఆధ్వర్యంలో ఉండేది. అటు సింగరేణి, ఇటు ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవటం లేదు. కొత్తగూడెం పట్టణానికి బైపాస్ లేని కారణంగా భారీ వాహనాలు కారుకొండ మార్గంలో వెళ్లడంతో రోడ్డు అస్తవ్యస్తంగా తయారయింది. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి, కొత్తగా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


అధ్వానంగా మారిన రోడ్డు

ప్రమాదాలు జరుగుతున్నాయి..



పెద్దపెద్ద వాహనాలు బొగ్గు కలప, ఇసుక లారీలు వెళ్లటం వల్ల కారుకొండ రోడ్డులో గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. కారుకొండ నుంచి శేషగిరినగర్ అడుగుకో గుంత ఏర్పడి, అందులో వర్షం నీరు నిల్వ ఉంటోంది. తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారే గానీ, శాశ్వత పరిష్కారం చూపాలి.

– మహేష్, కొత్తగూడెం

బైపాస్ నిర్మాణం చేయాలి..



కొత్తగూడెం పట్టణానికి బైపాస్ నిర్మాణం చేస్తే, ట్రాఫిక్ సమస్య ఉండదు. కారుకొండ మీదేగా భారీ వాహనాలు వెళ్తుంటే ఇళ్లల్లోకి దుమ్ము, ధూళి వస్తోంది. రోడ్డుంతా అధ్వానంగా ఉంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, ప్రమాదాలను నివారించాలి.

– సంపత్, కొత్తగూడెం

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


పాల్వంచరూరల్: దంతలబోరులో వరిపొలాన్ని పరిశీలిస్తున్న సీతారాములు

టేకులపల్లి: తుఫాను వలన పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం టేకులపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వెంటనే పంట నష్టాన్ని సమగ్ర సర్వే చేయాలన్నారు. గ్రామాలలో కల్వర్టులు నిర్మించాలని, తూర్పుగూడెం, మద్రాస్ తండా, తడికలపూడి, గంగారం తదితర గ్రామాలలో హైలెవెల్ వంతెనలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.ప్రసాద్, ఎట్టి నరసింహారావు, గుగులోతు రామచందర్, బానోత్ వెంకట్రాం, పొట్టయ్య, సమ్మయ్య, వినోద్, సూరయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: కిన్నెరసాని వరదల కారణంగా నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగం, దంతలబోరు గ్రామాల్లో వరద ముంపు ప్రాంతాలను గురువారం ఎమ్మెల్యే సందర్శించారు. అధికారులు వెంటనే పంటల నష్టాన్ని అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలన్నారు. ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇళ్లు, పరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, పీఆర్ డీఈ.రామకృష్ణ, ఎంపీఓ నారాయణ, ఏఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీరైతుకు ప్రభుత్వం సాయం అందిస్తుంది..

దంతలబోరు పంచాయతీలో గురువారం టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు పర్యటించి ఇటీవల వరదలకు నష్టపోయిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ.. రైతులు ఆధైర్య పడొద్దని, ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందన్నారు. కరీమ్‌పాషా, జయప్రకాశ్, బొల్లం ఉదయ్‌కుమార్, మొట్టం రాము, రాంబాబు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం)


కవితానాయుడు

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ జనరల్ మేనేజర్ పర్సనల్ (ఐఆర్‌పీఎం)గా కవితానాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈఈ సెల్ జీఎంగా విదులు నిర్వహిస్తున్న ఆమెకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఇటీవల యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు, అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఉపాధ్యాయులకు ఆర్టీసీ అధికారుల సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డీఎం దేవేందర్‌గౌడ్, సిబ్బంది

చుంచుపల్లి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో రెగ్యులర్‌గా ప్రయాణిస్తున్న టీచర్లకు డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్, సిబ్బంది గురువారం పూలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఏడు సంవత్సరాల నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయురాలు రాధ, ఉపాధ్యాయుడు బి.బాలును టీచర్స్ డే సందర్భంగా కొత్తగూడెం బస్టాండ్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా టీచర్లు ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా, సమయానికి గమ్యానికి చేరుస్తున్న కండక్టర్లు, డ్రైవర్లు మంచి సర్వీస్ ఇస్తున్న ఆర్టీసీ సిబ్బందికి పలువురు టీచర్లు ధన్యవాదాలు తెలిపారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వం


బ్రెడ్, పండ్లు అందజేస్తున్న రాంప్రసాద్

పాల్వంచ: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత్వం అని, సేవా కార్యక్రమాల్లో ప్రతీఒక్కరు పాలుపంచుకోవాలని పాల్వంచ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాంప్రసాద్, ఆర్ఎంఓ డాక్టర్ సోమరాజు దొర అన్నారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలతో పాల్వంచ సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న సుమారు 100 మంది పేషంట్లు, బాలింతలకు పాల్వంచ బాపూజీనగర్‌కు చెందిన యేసు కరుణా సువార్త మందిరం స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో స్వచ్ఛంధ సేవా సంస్థ అధ్యక్షుడు ప్రభుదాస్, అడవికట్ల సురేష్, కొండ్లె రవి, పాస్టర్ సురేష్, విజయ్, కాటయ్య, మధు, శ్రీను, బబ్లు, రంజిత్ పాల్గొన్నారు.

10న ఛలో హైదరాబాద్


మాట్లాడుతున్న సాగర్

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 10న ఛలో హైదరాబాద్ విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేయాలని, ఎస్ఎఫ్ఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి వాడే సాగర్ పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెంలోని జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరాపార్క్ వద్ద వేలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఇంత వరకు ప్రభుత్వం జిల్లాలోని ఏ మండలంలోనూ రెగ్యులర్ ఎంఈఓలను నియమించలేదని, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవచన, సుస్మిత, అక్షిత, రామ్‌చరన్ తదితరులు పాల్గొన్నారు.

కొమురయ్య సేవలు చిరస్మరణీయం


టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్టులో నివాళులర్పిస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికవర్గానికి కొమురయ్య చేసిన సేవలు చిరస్మరణీయ అని, నేడు కార్మికులు అనుభవిస్తున్న ప్రతీ హక్కు వెనక కొమురయ్య పోరాటం ఉందని, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మాజీ ప్రధాన కార్యాదర్శి యూనియన్ వ్యవస్థాపక సభ్యుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మనుబోతుల కొమురయ్య 28వ వర్ధంతిని ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయం, రుద్రంపూర్ ప్రాంతంలో కొమురయ్య విగ్రహాలకు తొలుత యూనియన్, పార్టీ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి సీతారామయ్య, కె.రాజ్‌కుమార్, దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్ పాల్గొన్నారు.

టేకులపల్లి: ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కోయగూడెం ఓపెన్‌కాస్టు ఆవరణంలో పిట్ సహాయ కార్యదర్శి బానోత్ బాలాజీ అధ్యక్షతన అమరజీవి మనుబోతుల కొమురయ్య 28వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కొంగర వేంకటేశ్వర్లు, షేక్ సర్వర్, సామల శ్రీనివాస్, సూరి, కనకరాజు, బాషబోయిన అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్త భవనాలకు నివేదిక ఇవ్వండి..


ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ భవనాలు శిథిలావస్థకు చేరాయని, మరమ్మతులు చేసిన అంతగా ఉపయోగం ఉండదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం అయన బస్టాండ్‌ను సందర్శించారు. శిథిలావస్థకు చేరిన భవన సముదాయంపై ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండు ఆవరణలో సౌకర్యాలను ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. యాభై ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, ప్రమాదాలు జరిగే పరిస్థితులు ఉన్నట్లు చెప్పారు. తాత్కాలిక మరమ్మతులతో నిధులు వృథా కావడం తప్ప ప్రయోజనం ఉండదన్నారు. ఆర్టీసీ సీఈ, ఈఈతో ఫోన్‌లో మాట్లాడి నూతన భవనాల నిర్మాణాన్ని ప్రతిపాదనలు, అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించి నూతన భవనాల నిర్మాణం కోసం ఒత్తిడి తెస్తానని తెలిపారు. బస్టాండ్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. బ్రీత్ ఎనలైజర్ మిషన్ల లోపాల వల్ల సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, దీన్ని తక్షణం రద్దు చేయాలన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సర్వీసులను పెంచాలన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ నాయకులు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఆర్ఎం సరిరాం, డీఎం దేవేందర్ గౌడ్, ఎస్కే సాబీర్‌పాషా, కందుల భాస్కర్, మాచర్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వరదలో చిక్కుకున్న వారిని కాపాడండి..

పాల్వంచరూరల్: ప్రమాదవశాత్తు వరదలో చిక్కుకున్న జారే సాయిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకరావాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డీడీఆర్ఎఫ్ బృందానికి సూచించారు. దంతలబోరు వద్ద కిన్నెరసాని వాగులో బుధవారం గల్లంతైన సాయి కోసం డీడీఆర్ఎఫ్, ఫైర్ బృందాలు రాగా వారితో గురువారం ఎమ్మెల్యే మాట్లాడారు. కిన్నెరసాని వరదలో చిక్కుకున్న వారి కోసం మీ ప్రయత్నాలు ముమ్మరం చేయాలన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న సెర్ప్ అధికారులు

ఇల్లెందురూరల్: సెర్ప్, మహిళా శక్తి స్వయం ఉపాధి పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఇల్లెందు, టేకులపల్లి మండలాలకు చెందిన సెర్ప్ అధికారులు ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. సెర్ప్, మహిళా శక్తి ద్వారా మహిళల స్వయం ఉపాధి కోసం అమలు చేస్తున్న పథకాల వివరాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఆయా పథకాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి ఉన్న అవకాశాలు, రుణ చెల్లింపుల వివరాలతోపాటు ఇప్పటి వరకు మహిళలకు అందజేసిన యూనిట్ల వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పేరుతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ప్రతీ గ్రామంలో ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి అర్హులకు మాత్రమే పథకాలు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కనీసం ఆరు నెలలకోమారైనా పథకాలు అందుకున్న మహిళలతో సమావేశం నిర్వహించి సమీక్ష చేయాలని, తద్వారా వారిలోనూ స్వయం ఉపాధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలుగుతుందన్నారు. సమావేశంలో డీపీఎం నాగజ్యోతి, ఏపీఎంలు దుర్గారావు, రవికుమార్, సీసీలు, అకౌంటెంట్ నందకుమారి, సీఈఓ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

మారుపేర్ల సమస్యను పరిష్కరించండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో మారుపేర్ల సమస్యను త్వరగా పరిష్కరించాలని జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) కవితానాయుడుని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం)గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జీఎంను సీఐటీయూ నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు సంక్షేమం, అన్ని క్యాటగిరిల సమస్యను పరిష్కరించాలని కోరారు. 2022లో ఆరు కార్మిక సంఘాలతో ఒప్పందం జరిగిందని దానిని అమలు చేయటంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని, మారు పేర్ల సమస్యతో ఇబ్బంది పడుతున్న కార్మికుల పెన్షన్, డిపెండెంట్ ఎంప్లాయిమెంట్, పుట్టినతేదీలో మార్పులు, అండర్ గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు వచ్చిన వారికి బేసిక్ ఫిక్సేషన్‌లో నష్టం జరుగుతోందని, వీటిని సరిచేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమార్గం చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మందా నర్సింహారావు, గాజుల రాజారావు, వైవీ రావు, సూరం అయిలయ్య, చంద్రగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలి


మాట్లాడుతున్న పాయం వెంకన్న

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు నుంచి బొగ్గును టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్న టిప్పర్ డ్రైవర్లు, క్లీనర్లకు వేతనాలు పెంచాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి బ్రాంచ్ కమిటీ సమావేశం సేవాలాల్ గుడిలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వేతనాలు పెంచాలని తొమ్మిది నెలల క్రితం డిమాండ్ నోటీసు ఇచ్చామని కానీ, నేటి వరకు వేతనాల ఒప్పందానికి టిప్పర్ ఓనర్లు ముందుకు రాలేదన్నారు. ఇప్పటికైనా వేతనాలు పెంపుపై యాజమాన్యాలు స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో జరుపుల సుందర్, జి.మదార్, జాటోత్ రవీందర్, అజ్మీరా భాస్కర్, బానోతు రఘు, తేజావత్ గణేష్ బానోత్ అశోక్, బానోత్ రమేష్, అజ్మీర విక్రం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సరుకులు వితరణ

ఇల్లెందు: పట్టణంలోని 2,3,5 వార్డులలో వరద బాధితులకు గురువారం కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఇల్లెందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో బాధితులకు సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రవికుమార్ నాయక్, ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్, నవీన్, కోర్టు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

భవిష్యత్ మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులు

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణమూర్తి జయంతి సందర్భంగా గురువారం విద్యాసంస్థల్లో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులను సన్మానించారు. పలువురు మాట్లాడుతూ.. బావిభారత పౌరుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే మార్గదర్శకులు ఉపాధ్యాయులనీ, సమాజంలో ప్రతీ మార్పుకు మూలం విద్య ఒక్కటేనన్నారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


సింగరేణి(కొత్తగూడెం): సెయింట్ జోసఫ్ స్కూల్‌లో


కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయులతో చైర్‌పర్సన్


పాల్వంచరూరల్: జగన్నాథపురం హైస్కూల్‌లో


సుజాతనగర్: శ్రీవాణి నికేతన్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు


ఇల్లెందురూరల్: డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్యను సత్కరిస్తున్న అధ్యాపకులు


టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో..


జూలూరుపాడు హైస్కూల్‌లో..